క్లుప్తంగా

నేడు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడతూర్పు): మహావీర్ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలో మాంసం విక్రయాలపై నిషేధం విధించినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కబేళాకు సెలవని పేర్కొన్నారు. నగరంలోని అన్ని మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి మాంసం విక్రయించే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణ యజమానులు, ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): సీపీఎం సీనియర్ నాయకులు కుండనాల అనిల్ వంశీ మూడవ వర్ధంతి సందర్భంగా విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని బీటీఆర్ భవన్ వద్ద స్థానిక పెద్దలు గంధం అంజిబాబు సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఐద్వా అధ్యక్షురాలు కుండనాల శేషమణి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు హాజరయ్యారు. సీపీఎం నగర కమిటీ సభ్యులు ఎస్ సుబ్బారెడ్డి, 44వ డివిజన్ నాయకులు ఎ సుదర్శన్, విక్రమ్ లక్ష్మి, యరసాని జోసఫ్, ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

24న పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ హనుమత్ దీక్షా పీఠం ఆవరణలో అభివృద్ధి పనులకు ఈ నెల 24వ తేదీన శంకుస్థాపన చేస్తామని పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ పేర్కొన్నారు. పీఠం ఉత్తర వైపున నూతన భవన నిర్మాణ పనులకు పూజలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి అఖిల భారత హనుమత్ దీక్షా సేవా సమితి, అన్ని విభాగాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, దీక్షా స్వాములు, భక్తులు విచ్చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నూకాలమ్మ సంబరం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సొరంగం సమీపంలోని నూకాలమ్మ ఆలయంలో శనివారం అమ్మవారి సంబరాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూకాలమ్మ దేవస్థాన నిర్వాహకులు అమ్మవారి ఉత్సవమూర్తితో తొలుత ఊరేగింపు చేశారు. అమ్మవారి భక్తులు, ఉభయదాతలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం కలశాలతో తీసుకొచ్చిన జలాలతో నూకాలమ్మకు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక నారాయణ ఇ టెక్నో స్కూల్లో ఇ-కిడ్స్ విభాగంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. యూకేజీ పూర్తి చేసుకున్న చిన్నారులను మొదటి తరగతిలోకి, అలాగే 5వ తరగతి నుంచి 6వ తరగతిలోకి వచ్చిన విద్యార్థులను ఆహ్వానిస్తూ ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రాడ్యుయేట్ దుస్తులు ధరించి పట్టాలను చూపటం చూసి వారి తల్లిదండ్రులు, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు మురిసి పోయారు. కార్యక్రమంలో ఇ-చాంప్స్, ఇ-కిడ్స్ హెడ్స్ వాణి, మారియ, ఏజీఎం మురళి, ప్రిన్సిపాల్ సతీష్, కో ఆర్డినేటర్ కనకదుర్గ, లియోని తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పోక్సో చట్టంపై అవగాహన

ఆగిరిపల్లి: బాలలపై లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై బాలల ఆశ్రమ సిబ్బందితో పాటు పౌరులందరూ అవగాహన కలిగి ఉండాలని విజయవాడ వాసవ్య మహిళా మండలి ఉపాధ్యక్షురాలు కె.విజయ అన్నారు. మండలంలో శనివారం తోటపల్లి హీల్ సంస్థలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలను అసందర్భంగా తాకడం, సైగలు చేయడం, అశ్లీల పదాలను ప్రయోగించడం, శారీరక హింసకు గురిచేయడం, బాల్య వివాహాలు వంటి నేరాలకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. సైబర్ సంబంధిత నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, ప్రిన్సిపాల్ సాయిబాబు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలబడాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న లీగల్ సెల్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహర్షి వాల్మీకి రచించిన రామాయణంలోని ఒక శ్లోకంలో రాయబడినట్లు ధర్మో రక్షతి రక్షితః అన్నట్లుగా ధర్మం వైపు ఎవరైతే ఉంటారో వారు రక్షింపబడతారని, అధర్మం వైపు ఉండే వారు ఎప్పటికైనా నాశనం కాక తప్పదని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తెలిపారు. ధర్మం, న్యాయం పక్షాన ఉన్న సీఎం జగనన్నకు అండగా నిలబడాలని తనను కలిసేందుకు వచ్చిన లీగల్ సెల్ సభ్యులను కోరారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ అబ్రహాం లింకన్ నేతృత్వంలో పలువురు సభ్యులు శనివారం విద్యాధరపురం బైపాస్ రోడ్ పక్కన ఉన్న వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి వచ్చి ఆసిఫ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి తమ మద్దతు ప్రకటించారు. ఆసిఫ్‌ను శాలువాతో సత్కరించి రానున్న ఎన్నికల్లో మీ విజయానికి తమ వంతు కృషి అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఆసిఫ్ మాట్లాడుతూ రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా విలువలు, విశ్వసనీయతకు పెద్ద పీట వేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాజకీయ ఎన్నికల సంగ్రామంలో అంతిమంగా న్యాయం, ధర్మమే గెలుస్తుందని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అని పేర్కొన్నారు. నిత్యం న్యాయం, ధర్మం పక్షాన పోరాడే న్యాయవాదులంతా వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. జగనన్నకు మళ్లీ ముఖ్యమంత్రిగా పట్టం కట్టేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆసిఫ్‌కు మద్దతుగా నిలిచి అభినందనలు తెలిపినవారిలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యులు వి.కోటయ్య, ఎస్.మౌళి, బి.కెనడి, కె.అనంత బాబు, ఎం.ఇబ్రాయేల్, ఎం.శివరామకృష్ణ, సీహెచ్ ఆదంకుమార్, కె.నాంచారయ్య తదితరులు ఉన్నారు.

జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఆర్థిక సలహాదారు రాజేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జీఎస్టీ వంటి పన్నుల విధానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రముఖ ఆర్థిక సలహాదారు, చార్టర్డ్ అకౌంటెంట్ జి. రాజేష్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న జీఎస్టీ విధానంపై వర్క్‌షాప్ శనివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ప్రధానవక్తగా హాజరైన రాజేష్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఒకే పన్నుల విధానం కొనసాగుతుందని తెలిపారు. జీఎస్టీ విధానం ద్వారా ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వాటా ఉంటుందని పేర్కొన్నారు. జీఎస్టీకి సంబంధించి అనేక అధ్యయనాల తరువాత దానిని దేశంలో అమలు చేయటం ప్రారంభించారన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ విధానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవటం ద్వారా కామర్స్ విద్యార్థులుగా చాలా విస్తృతమైన సమాచారాన్ని పొందుతారని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారి వారి రంగాలపై పట్టు సాధించేందుకు ఈ విధమైన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరో నిపుణుడు అక్షయ్‌జైన్ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. విభాగాధిపతి హేమంత్‌కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

రెడ్డిగూడెం: కృష్ణా మిల్క్ యూనియన్‌లో పాలు పోసి యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి అన్నారు. కొత్తరెడ్డిగూడెం పాల కేంద్రంలో పాలు పోసిన రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ మూడో విడత రూ. 3,30,033ల బోనస్‌ను శనివారం పంపిణీ చేశారు. కొత్తరెడ్డిగూడెం పాల సంఘం డైరెక్టర్లు ఎ. జమలారెడ్డి, డి. శ్రీనివాసరెడ్డి, టి. బాబురెడ్డి, జి. నరసింహరెడ్డి, జి. వాణి తదితరులు పాల్గొన్నారు.

నలందలో అదనపు కోర్సుల్లో శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): పోటీ ప్రపంచంలో రాణించాలంటే సిలబస్‌తో పాటు, అదనపు నైపుణ్యాలు ఎంతో అవసరమని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ అన్నారు. ఆ కళాశాలలో అదనపు కోర్సుల సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ అధునాతన టెక్నాలజీలలో ప్రావీణ్యం పొందేలా వివిధ సర్టిఫికేషన్ కోర్సులు నేర్చుకోవాలని సూచించారు. ఇండస్ట్రీల్లో అవసరాలకు ఉపయోగపడే నైపుణ్యాలను తమ విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సెలోనిస్ అకాడమీ ద్వారా రెండో ఏడాది బీబీఏ, బీకామ్ విద్యార్థులు 77 మందికి ప్రాసెస్ మైనింగ్ సర్టిఫికేషన్, రెండో ఏడాది బీఎస్సీ , బీబీఏ బిజినెస్ ఎనలిటిక్స్‌కు చెదిన 60 మందికి బ్లూప్రిజమ్ సర్టిఫికేషన్, బీఎస్సీ చదువుతున్న 90 మందికి గూగుల్ ఆండ్రాయిడ్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ అందించినట్లు వెల్లడించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.చంద్రగిరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి





భక్తి గీతాలు ఆలపిస్తున్న ఆదినారాయణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ ఆలపించిన భక్తి గీతాలు భక్తులను అలరించాయి. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న చెరువు ఆదినారాయణ స్టేజీపై నాటకాలు, పద్యాలు, భక్తి గీతాలను ఆలపిస్తుంటారు. చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్థానం పలువురు భక్తులకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే అవకాశం కల్పిస్తుంది. చెరువు ఆదినారాయణ పలు భక్తి గీతాలను ఆలపించారు. దీంతో అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు సంగీత విభావరిని ఎంతో ఆసక్తిగా విని ముగ్ధులయ్యారు. అనంతరం ఆదినారాయణను ఆలయ ఈవో కేఎస్ రామరావు అభినందించడంతో పాటు శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందచేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- 22 నుంచి ప్రారంభం
- 27వ తేదీ వరకు నిర్వహణ





ముస్తాబైన ఆలయం (ఇన్‌సెట్).. వెంకటేశ్వర స్వామి

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 22 నుంచి 27 వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అందుకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రానుండటంతో అధికారులు భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు, తాగునీరు, ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ, ప్రసాదాల ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఆరు రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అర్చకులు, వేద పండితుల సూచనల మేరకు అధికారులు అన్ని వసతులు సమకూర్చారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేస్తున్నారు.

కల్యాణ ఉత్సవాలు ఇలా...

22న అంకురారోపణ (స్వామి వారిని పెండ్లి కుమారుని చేయట), దీక్షా స్వాముల ఇరుముడి సమర్పణ, 23న రాత్రి తొమ్మిది గంటలకు స్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, 24న రాత్రి రథోత్సవం, 25న హోమం, బలిహరణ, సప్త కలశస్నాపనం, 26న వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, 27న పవళింపు సేవ, అశ్వవాహనోత్సవం, ఉత్సవాలు ముగియనున్నాయి. చివరి రోజు మహిళా భక్తులకు కుంకుమ భరిణలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆలయానికి చేరుకొనే మార్గాలు..

జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు మీదుగా తిరుమలగిరికి బస్సు, ఆటో సౌకర్యం ఉంది. 24 గంటల పాటు ఆటోలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతే కాకుండా ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.



ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశాం. కల్యాణ వేదికపై అర్చకులు, అన్నిశాఖల అధికారులకు మాత్రమే అనుమతి. వీఐపీ పాస్‌లు కూడా రద్దు. తాగునీటి కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. అంతే కాకుండా మజ్జిగతో పాటు దాతల సహాయంతో కూలర్‌లు ఏర్పాటు చేశాం.

–నూతక్కి వెంకట సాంబశివరావు,
ఆలయ ఇన్‌ఛార్జ్ ఈవో

రామాలయంలో ద్వాదశ ప్రదక్షిణలు



అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ నగరాల సీతారామస్వామి వారి దేవస్థానంలో శనివారం రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న స్వామి వారి నవమి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామి వారికి పలు విశేష వైదిక కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీగా అన్నదాన వితరణ నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థాన కమిటీ, స్థానిక ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, 20వ డివిజన్‌లోని నల్లగేటు డౌన్‌లో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ అభిమానుల సంఘం నాయకుడు లొల్లా కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. బాటచారులకు చల్లని మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా పాదచారుల దాహార్తిని తీర్చేందుకు గత ఏడేళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సరోజని, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెడిటేషన్‌తో శారీరక, మానసిక ప్రశాంతత



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి రోజూ మెడిటేషన్ చేయడం ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. కళాశాలలో శనివారం 'మెడిటేషన్ అండ్ మైండ్ ఫుల్‌నెస్' సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మెడిటేషన్‌తో బుద్ధి వికాసం, శక్తి సామర్థ్యాలు మెరుగుపర్చుకోవచ్చని చెప్పారు. ఓర్పు, సహనం, ఏకాగ్రత పెంపొందించుకోవడంతో పాటు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి మెడిటేషన్ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం 40 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ కిరణ్మయి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కేఆర్‌సీసీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. ఇప్పటివరకు పశ్చిమ నియోజకవర్గంలో నాలుగు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పశ్చిమ నియోజకవర్గ ఆర్వో కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని పేర్కొన్నారు. రిటర్నింగ్ కార్యాలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థులు అవసరమైన అన్ని డాక్యుమెంట్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎటువంటి వివక్ష లేకుండా ఎంసీసీ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 19 సీజర్లు జరిగాయని, వీటిలో 15 సీజర్లకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు చూపారన్నారు. నాలుగు కేసులకు సంబంధించి ఎటువంటి ఆధారాలు అందలేదన్నారు. నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. మొత్తం 253 పోలింగ్ కేంద్రాల్లో 97 క్రిటికల్‌గా గుర్తించడం జరిగిందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్స్ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలు, ఎంసీసీ, ఇతరాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

తాటిగుమ్మి(వీరులపాడు): మండలంలోని తాటిగుమ్మి గ్రామంలో వేంచేసియున్న అలివేలు మంగా పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలలో భాగంగా శనివారం ఆలయ అర్చకులు ప్రదీప్ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, సహస్రనామార్చన, మహానివేదన, విశ్వక్సేనారాధనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బెజవాడ నారపరెడ్డి, ఝాన్సి, ఆలయ చైర్మన్ కొండపురెడ్డి వెంకటరామిరెడ్డి, కరుణలు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామి వారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళ్యాణోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్వామి వారి కల్యాణం అనంతరం మూడు వేల మందికి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన గాయం శ్రీకాంత్ రెడ్డి, రాధాలత దంపతులు రూ.25 వేలు, తాటిగుమ్మి గ్రామానికి చెందిన డాకా రవీందర్ రెడ్డి, వనజా దంపతులు రూ.25 వేలు విరాళమందించారని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

అగ్నిమాపక పరికరాలపై అవగాహన



అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గ్యాస్, పెట్రోల్, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎదరయ్యే అగ్ని ప్రమాదాల నుంచి చిన్న పాటి జాగ్రత్తలతో ప్రాణాలను కాపాడుకోవచ్చునని కొత్తపేట అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం కేటీ రోడ్డులోని అగ్నిమాపక కేంద్రంలో మంటలను అదుపు చేసే పరికరాలపై అవగాహన కల్పించారు. స్థానిక చిరు వ్యాపారులు, ప్రజలకు అగ్ని మాపక కేంద్రంలో అందుబాటులో ఉన్న పరికరాల గురించి వివరించారు. ఒక వేళ అనుకోకుండా ప్రమాదాలు జరిగితే జాగ్రత్తలు పాటించడం వల్ల అగ్ని, ప్రాణ నష్టాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

శేషవాహనంపై కొలువుదీరిన కోదండరాముడు



శేషవాహనంపై కోదండరాముడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం (కొత్తగుళ్ళు) ప్రాంగణంలో వేంచేసి ఉన్న కోదండరామస్వామి శనివారం శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి దర్బార్ సేవ చేశారు. ఉత్సవంలో పాల్గొన్న అందరికీ స్వామి వారి ఆశీస్సులను అర్చకస్వాములు అందజేశారు. అనంతరం స్వామి వారికి ప్రీతికరమైన శేషవాహనంపై కొలువుదీరి భక్తులకు నేత్రానందాన్ని కలిగించారు. నగరేశ్వరస్వామి వారి భజనమండలి వారిచే భజన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఆలయంలోని మూలవిరాట్‌లకు కూడా విశేష అర్చనలను నిర్వహించారు. అర్చకస్వాములు పులిపాక రాఘవాచార్యులు ఆంజనేయాచార్యులు వైదిక కార్యక్రమాలు చేశారు.

రేపటి నుంచి మరకత శివలింగ వాయు ప్రతిష్ట

24న విగ్రహ ప్రతిష్ట



మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం మరకత శివలింగ వాయు ప్రతిష్ట కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు స్వయంగా అభిషేకం చేసుకునే విధంగా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ట చేస్తున్నామని తెలిపారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు గోపూజతో ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఆలయ ప్రదక్షిణ, అధిష్టాన దేవతల అనుజ్ఞ, శ్రీ మహాగణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధన, దీక్షావస్త్రధారణ, కలశస్థాపనలు, మూమంత్ర హోమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు సాయంకాల మండప పూజలు, విగ్రహాలకు జలాధివాసం చేస్తామన్నారు. 23న మంగళవారం ప్రత్యేక పూజలు అభిషేకాలు, హోమాలు జరుగుతాయన్నారు. 24న బుధవారం ఉదయం 10.43 గంటలకు రత్న ధాతు, దాన్య యంత్ర సహిత శివలింగ ప్రతిష్ట జరుగుతుందని చెప్పారు. ఈ విశేష మరకత శివలింగంకు భక్తులు ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు స్వయంగా అభిషేకం చేసుకోవచ్చని, సాయంత్రం అలంకరణ, అర్చనలు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతిష్ట మహోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. డాక్టర్ దొంతిరెడ్డి లక్ష్మణరెడ్డి, ఆలయకమిటీ కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, పీ శ్రీనివాసరావు, సైదులు, లఖంరాజు సునీత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి 23న కౌన్సెలింగ్

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేని గూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ వై.యశోద లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న బాలికలు ఉదయం 9 గంటల సమయంలోపు పాఠశాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, మెరిట్ లిస్ట్ ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.